క్లుప్తంగా

జెడ్పీ పాఠశాలలో సామాజిక తనిఖీ



బెల్లంకొండ (పెదకూరపాడు): బెల్లంకొండ జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం మధ్యాహ్న భోజనాన్ని సామాజిక తనిఖీ బృందం పరిశీలించింది. స్టేట్ రిసోర్స్ పర్సన్ ఎం.లోకేష్, జిల్లా రిసోర్స్ పర్సన్ ఎస్.తిరుపాల్ పాఠశాలలోని రికార్డులు, సైన్స్, మాథ్స్ ల్యాబ్‌లను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో ముఖాముఖిగా మాట్లాడారు. మధ్యాహ్న భోజనం మెనూ, నాణ్యతపై చర్చించారు. విద్యార్థుల అభిప్రాయాలను సేకరించారు. గురువారం విద్యార్థుల తల్లిదండ్రులతో పాఠశాలలో ముఖాముఖీ కార్యక్రమాన్ని నిర్వహించి తదుపరి వివరాలను వెల్లడిస్తామన్నారు. పాఠశాల హెచ్‌ఎం ఎన్.శాంతి, ఉపాధ్యాయలు శిరీష, అచ్చయ్య పాల్గొన్నారు.

పింఛన్ల తనిఖీ

సత్తెనపల్లి: అనారోగ్య పింఛన్లు పొందుతున్న లబ్ధిదారుల పత్రాలను మున్సిపల్ అధికారులు, వైద్య సిబ్బంది మంగళవారం తనిఖీ చేశారు. పట్టణంలో 8 మంది పింఛన్‌దారుల గృహాలకు వెళ్లి మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి, వైద్యుల బృందం ఆరా తీశారు. వారి ధ్రువపత్రాలను పరిశీలించి క్షేత్రస్థాయిలో వారి ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు. ఆ వివరాలను సంబంధిత యాప్‌లో నమోదు చేశారు.

అన్న క్యాంటిన్‌లో ఆకస్మిక తనిఖీ



సత్తెనపల్లి: పట్టణంలోని తాలూకా సెంటర్‌లో గల అన్న క్యాంటీన్‌ను మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అల్పాహారం ఎలా ఉందని అక్కడ వారిని అడిగి తెలుసుకున్నారు. అల్పాహారం నిర్ణీత సమయాలకు అందుతుందా? లేదా? అనే వివరాలను ఆరా తీసి మెనూ పరిశీలించారు. ఈ సందర్భంగా 7వ వార్డు కౌన్సిలర్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ రంగిశెట్టి సుమన్‌కుమార్ పేదలకు అన్న క్యాంటీన్ టోకెన్లను కొనుగోలు చేసి ఉచితంగా అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

పిచ్చి తీగల తొలగింపు



సాక్షి ఎఫెక్ట్

ముప్పాళ్ళ: మండల కేంద్రమైన ముప్పాళ్ల వాటర్ ట్యాంక్‌కు అల్లుకుపోయిన పిచ్చిమొక్కలు తొలగింపు పనులు మంగళవారం చేపట్టారు. గత సోమవారం సాక్షి దిన పత్రికలో 'పెద్ద నిర్లక్ష్యమే' అంటూ వచ్చిన వార్త కథనానికి అధికారులు స్పందించారు. తహసీల్దార్ ఎం.భవానిశంకర్, ఎంపీడీవో పీజే విలియమ్స్, ఈఓపీఆర్డీ రూపవతి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఉమర్ ఫరూఖ్ వాటర్‌ట్యాంక్ ను ఆవరణను పరిశీలించారు. వెంటనే ఆవరణను శుభ్రం చేయాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. అలాగే రక్షిత మంచినీరు కూడా అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అడుగడుగునా అధ్వానం

రాజధానికి కూతవేటు దూరంలో ఉన్న పెదకూరపాడు బస్టాండ్ సమస్యలతో కూనారిల్లుతోంది. వెలగని విద్యుత్ దీపాలు, పనిచేయని, దుర్వాసన వెదజల్లుతున్న మరుగుదొడ్లు, బస్టాండ్‌లోనే ద్విచక్ర వాహనాలు పార్కింగ్, రాత్రిళ్లు అకతాయిలు అగడాలు.. పెచ్చులూడుతున్న పైకప్పు.. పనిచేయని మినరల్ వాటర్ ప్లాంట్ ఇలా.. అడుగడుగునా అధ్వానంగా తయారైంది.



అంధకారంలో పెదకూరపాడు బస్టాండ్

- దుస్థితిలో పెదకూరపాడు బస్టాండ్
- పనిచేయని, దుర్వాసన వెదజల్లుతున్న మరుగుదొడ్లు
- మహిళా ప్రయాణికులకు తప్పని అవస్థలు
- ప్రయివేటు వాహనాలు పార్కింగ్
- వెలగని విద్యుత్ దీపాలు.. పెచ్చులూడుతున్న పైకప్పు

పెదకూరపాడు: పెదకూరపాడు బస్టాండ్‌ను 1988లో అప్పటి హోం మంత్రి కోడెల శివప్రసాద్ ప్రారంభించారు. ఇక్కడి నుంచి నిత్యం వందలాది మంది ప్రయాణికులు అమరావతి, గుంటూరు, సత్తెనపల్లి, మండలంలోని లగడపాడు, అత్తలూరుకు ప్రయాణిస్తుంటారు. రద్దీగా ఉండే బస్టాండ్‌లో కనీస వసతులు కల్పించడంలో రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ పూర్తిగా విఫలమైంది.

మహిళా ప్రయాణికులకు ఇబ్బందులు

వందలాది మంది మహిళా ప్రయాణికులు ఈ బస్టాండ్ నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్తుంటారు. కానీ, ఇక్కడ మరుగుదొడ్లు పనిచేయవు. నిర్వహణకు దాతలు మోటర్‌ను ఏర్పాటు చేసినా.. నిర్వహణలో నిర్లక్ష్యం కారణంగా ఆర్టీసీ సిబ్బంది దానిని కూడా అటకెక్కించారు. మరుగుదొడ్ల నిర్వహణకు నీరు లేకపోవడంతో దుర్వాసన వెదజల్లుతున్నాయి. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతం కావడంతో మహిళ ప్రయాణికులు టాయిలెట్స్‌కు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



మూతపడిన మరుగుదొడ్లు

బస్టాండ్‌లోనే పార్కింగ్

బస్టాండ్‌ను స్థానికులు తమ వాహనాలకు పార్కింగ్ ప్రదేశంగా వాడుకుంటున్నారు. ఆవరణలో ప్రయివేటు వాహనాలను నిలుపుకునేందుకు వినియోగించుకుంటున్నా.. ప్రశ్నించే నాథుడే లేడు. రాత్రిళ్లు బస్టాండ్‌లోనే అకతాయాలు అసాంఘిక కార్యక్రమాలకు అడ్డగా మార్చుకుంటున్నారు.



మహిళలకు ఇబ్బందులు



బస్టాండ్‌లో మరుగుదొడ్లు నిరుపయోగంగా ఉన్నాయి. అనేక పర్యాయాలు సత్తెనపల్లి డిపో మేనేజర్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. రద్దీగా ఉంటే ప్రదేశంలో మహిళలు వాష్ రూంకు వెళ్లేందుకు అవస్థలు పడుతున్నారు.

–షేక్ జాకీర్, పెదకూరపాడు

పెచ్చులూడుతున్నాయి



బస్టాండ్ లోపలి భాగం పెచ్చులూడుతోంది. వర్షం వస్తే ఉరుస్తోంది. ప్రయాణికులు వేచి ఉండేందుకు ఇబ్బందుడుతున్నారు. మరమ్మతులు చేయాలి. ద్విచక్ర వాహనాల పార్కింగ్ సౌకర్యం కల్పించారు.

–షేక్ జిలాని, పెదకూరపాడు

విద్యుత్ దీపాలు వెలగడం లేదు



బస్టాండ్ ఆవరణలో విద్యుత్ దీపాలు వెలగడం లేదు. నియోజకవర్గ కేంద్రమైన పెదకూరపాడు బస్టాండ్ విషయంలో ఇంతా నిర్లక్ష్యంగా వ్యవహరించడం బాధాకరం. ప్రయాణికులు రాత్రి రోడ్డుపైనే ఉంటున్నారు.

–షేక్ అన్వార్, పెదకూరపాడు

పెచ్చులూడుతున్న పై కప్ప

బస్టాండ్ పైకప్పు పెచ్చులూడుతోంది. ప్రయాణికులపై పడితే గాయాలుపాలవడం ఖాయం. వర్షం వస్తే ఉరుస్తోంది. గతంలో మరమ్మతులు చేసినప్పటికీ నాణ్యత లోపంతో మళ్లీ పెచ్చులూడుతున్నాయి. సంబంధిత అధికారులు వెంటనే మరమ్మతులు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.



మిర్చిలో నల్లతామర తెగులు



మిర్చి పంటను పరిశీలిస్తున్న ఏవో వెంకటేశ్వర్లు



మిర్చి పంట పరిశీలిస్తున్న ఉద్యానఅధికారి నవీన్

అచ్చంపేట: మిర్చి పంటలో నల్లతామర తెగులు సమూలంగా నివారించేందుకు రైతులు వ్యవసాయశాఖ సూచనలను పాటించాలని ఏవో పి.వెంకటేశ్వర్లు తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం తాళ్లచెరువులో మిర్చి, మొక్కజొన్న పంటలను ఆయన పరిశీలించారు. మిర్చి పంటలో నల్లతామర తెగులు ఎక్కువగా కనిపిస్తోందని తెలిపారు. నివారణ చర్యలు వివరించారు. మొక్కజొన్న, శనగ పంటలను రైతు సేవా కేంద్రాల్లో నమోదుచేసుకోవాలన్నారు.

మొక్కజొన్నలో కత్తెర పురుగు

మాదల(ముప్పాళ్ళ): మొక్కజొన్న పైరుపై కత్తెర పురుగు గమనించినట్లయితే వెంటనే నివారణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ చెప్పారు. మాదల, ఇరుకుపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. కత్తెర పురుగు నివారణ నివారణ చర్యలను రైతులకు వివరించారు. మొక్కజొన్న, శనగ పంటలను ఈ–పంట నమోదు చేయించుకోవాలన్నారు. గ్రామ సర్పంచ్ తిరుమలశెట్టి సైదుబాబు, వీహెచ్‌ఏ నరేష్, ఏఈఓ నారాయణ పాల్గొన్నారు.

మిరపలో వేరుతెగులు నివారణకు చర్యలు

క్రోసూరు: నాగవరం గ్రామంలో మిరప తోటలను బుధవారం ఉద్యానఅధికారి దాసరి నవీన్ సందర్శించారు. మిరప సాగు రైతులతో మాట్లాడారు. వేరు తెగులు నివారణ తెలిపారు. తెగులు సోకిన పొలం నుంచి నీటిని మరో పొలానికి పెట్టకూడదన్నారు. పెడితే మళ్లీ తెగులు వ్యాప్తి చెందడానికి అవకాశం ఉంటుందన్నారు.

మొక్కజొన్నలో కత్తెర పురుగు

రాజుపాలెం: గణపవరం గ్రామంలోని మొక్కజొన్న పొలంలో పొలం పిలుస్తుందనే కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. వ్యవసాయాధికారి పి.వెంకటనర్సయ్య రైతులతో మాట్లాడుతూ మొక్కజొన్న పంటలో అక్కడక్కడ కత్తెర పురుగు ఉన్నట్లు వారికి వివరించారు. నివారణ చర్యలు తెలిపారు. వ్యవసాయ సహాయకులు జె.వెంకయ్య, రైతులు పాల్గొన్నారు.

రెండు ఇళ్లల్లో చోరీ

క్రోసూరు: అనంతవరం గ్రామంలో మంగళవారం మధ్యాహ్నం రెండు ఇళ్లల్లో జరిగిన దొంగతనాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. గ్రామంలోని ఎస్సీ కాలనీలోని కుంభా రాముడు ఇంటి తాళాలు పగలగొట్టి లక్ష రూపాయలు నగదు, 4 గ్రాముల బంగారం, అలాగే బీసీ కాలనీలోని బెజ్జంకి పద్మ ఇంటిలో 4 సవర్ల బంగారం , రూ.5 వేల నగదు దొంగించినట్లు బాధితులు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ నాగేంద్రరావు, సిబ్బంది ఘటన ప్రాంతాలను పరిశీలించారు.

పారాగడ్డి పెంపకం లాభదాయకం

అమరావతి: మండలంలోని రైతులు ప్రస్తుతం ఉన్న వరిగడ్డి కొరతను నివారించేందుకు అధిక దిగుబడినిచ్చే పారాగడ్డి పెంచాలని పశు సంవర్ధకశాఖ సహాయ సంచాలకుడు వెంకట్రామయ్య తెలిపారు. మంగళవారం ధరణికోట పశు వైద్యశాలలో పారాగడ్డి పెంపకం గురించి రైతులకు వివరించారు. పారా గడ్డిని హెక్టారుకు 8 నుంచి 10 క్వింటాళ్ల కాండపు ముక్కలు గాని, 90 వేల నారు మొక్కలు నాట వచ్చునని తెలిపారు. హెక్టారుకు 80 నుంచి 100 టన్నుల వరకు పారా గడ్డి దిగుబడి వస్తుందన్నారు.

లక్కీ డ్రా విజేతలకు బహుమతుల ప్రదానం



సత్తెనపల్లి: పట్టణంలోని పోలీసుశాఖ నిర్వహిస్తున్న పెట్రోల్ బంక్‌లో నిర్వహించిన ఐటీసీఎల్ స్కీంలో లక్కీ డ్రా ద్వారా గెలుపొందిన విజేతలకు పట్టణ సీఐ బి.బ్రహ్మయ్య మంగళవారం బహుమతులు ప్రదానం చేశారు. బంక్ వద్ద విజేతలు శ్రీనివాసరావు, నరేష్ కుమార్, అయ్యప్ప స్వామి, సత్యనారాయణ, జయరాంలకు ట్రావెల్ బ్యాగులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది ఉన్నారు.

భీమవరం పంచాయతీ సెక్రటరీ మృతి



సత్తెనపల్లి: మండలంలోని భీమవరం పంచాయతీ కార్యదర్శి నక్కా కోటిరెడ్డి (59) అనారోగ్యంతో మృతి చెందారు. రెండు నెలలుగా మెడికల్ లీవ్ పెట్టుకుని వైద్య సేవలు పొందుతూ ఆయన సోమవారం రాత్రి చనిపోయారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మంగళవారం కోటిరెడ్డి మృత దేహాన్ని ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి సందర్శించి, నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మండల విస్తరణ అధికారి ఎ.శ్రీనివాసరెడ్డి, సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, భీమవరం సర్పంచ్, ఇతర నాయకులు నివాళులలర్పించారు.

సీసీ రోడ్డుకు శంకుస్థాపన



సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న నాయకులు

పెదకూరపాడు: కూటమి ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తోందని టీడీపీ మండలాధ్యక్షుడు అర్తిమల్ల రమేష్ అన్నారు. ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ఇచ్చిన హామీ మేరకు జంగాల కాలనీ, గంటావారి వీధి, బీసీ కాలనీలో రూ.40 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ప్రజా ప్రతినిధులు అధికారులతో కలిసి మంగళవారం శంకుస్థాపన చేశారు. దాతల తోడ్పాటు తిరుమల తిరుపతి దేవస్థానం సహకారంతో రూ. 2 కోట్లతో నిర్మిస్తున్న కల్యాణ మండపం నిర్మాణ పనులను పరిశీలించారు. 75 త్యాళ్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో రూ. 23 లక్షలతో స్టాఫ్ రూమ్ ఏర్పాటుకు త్వరలో శంకుస్థాపన చేస్తామన్నారు. మాజీ ఎంపీపీలు బెల్లంకొండ రాంగోపాలరావు, గర్లబాబు, డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ వడ్లమూడి అప్పారావు, క్లస్టర్ ఇన్‌చార్జ్ అజుముల్ల, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు మక్కెన సాగర్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధుల నిర్మూలనకు పశువైద్య శిబిరాలు



గ్రంథశిరిలో పశువును పరీక్షిస్తున్న డాక్టర్ స్వాతీదేవి



లంకెలకూరపాడులో టీకాలు వేస్తున్న అధికారులు

అచ్చంపేట: పశువులు, గొర్రెలు, మేకలలో సీజనల్‌గా వచ్చే వ్యాధులను నిర్మూలించేందుకే ప్రభుత్వం గ్రామ గ్రామాన ఉచిత పశువైద్య శిబిరాలను ఏర్పాటు చేసినట్లు మండల పశువైద్యాధికారిణి డాక్టర్ స్వాతీదేవి తెలిపారు. గ్రంథశిరిలో మంగళవారం నిర్వహించిన పశు వైద్యశిబిరంలో రైతులనుద్దేశించి ఆమె మాట్లాడారు. 15 పశువులకు ప్రాథమిక చికిత్స, 65 పశువులకు, 50 దూడలకు ఏలికపాముల నివారణకు మందు తాగించారు. 300 జీవాలకు నట్టల నివారణ టీకాలు వేశారు. స్థానిక పశువైద్య సిబ్బంది జె.సందన, జె.అన్నప్ప పాల్గొన్నారు.

దిడుగు, చావపాడులో పశు వైద్య శిబిరాలు

అమరావతి: మండలంలోని దిడుగు, చావపాడు గ్రామాల్లో మంగళవారం పశు వైద్య ఆరోగ్య శిబిరాలు నిర్వహించారు. పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వెంకటరామయ్య ఆధ్వర్యంలో వైద్యాధికారి బి.పూర్ణ చరణ్ 63గేదెలకు, 24 దూడలకు, 150 గొర్రెలకు నట్టల నివారణ మందులు అందించారు. గర్భకోశ వ్యాధులకు చికిత్స, చూడి పరీక్షలు, ఉచిత కత్రిమ గర్భధారణ గొర్రెలకు, మేకలకు బొబ్బ టీకాలను వేశారు.

పశు ఆరోగ్య శిబిరం

బెల్లంకొండ (పెదకూరపాడు): మాచయిపాలెం గ్రామంలో మంగళవారం పశు ఆరోగ్య శిబిరాన్ని పశుసంవర్ధక శాఖ అధికారులు నిర్వహించారు. శిబిరంలో మొత్తం 264 పశువులు, ఎదకు రాని పశువులు 17, ఎద ఇంజక్షన్లు 4, 12 సూడి పరీక్షలు, పెద్ద పశువులు 53, చిన్నవి 32 దూడలకు నట్టల నివారణ మందు అందించారు. జీవాలకు బొబ్బ టీకాలు వేశారు.

31 పశువులకు వైద్య సేవలు

రాజుపాలెం: మండలంలోని బ్రాహ్మణపల్లిలో ఉచిత పశువైద్య శిబిరం మంగళవారం జరిగింది. ఈ శిబిరంలో డాక్టర్ నాగేశ్వరరావు 22 గేదెలకు సూడు పరీక్షలు చేశారు. 31 పశువులకు నట్టల నివారణ మందుల పంపిణీ చేశారు. సర్పంచ్ ఓర్సు వెంకటపతి, మాజీ సర్పంచ్ శ్రీను, రైతులు పాల్గొన్నారు.

క్రోసూరు, దొడ్లేరులో..

క్రోసూరు: మండల పశు వైద్యుడు డాక్టర్ మల్లయ్య బుధవారం క్రోసూరు,దొడ్లేరు గ్రామాల్లో పశు ఆరోగ్య శిబిరాలను నిర్వహించారు. 1,310 పశువులకు, జీవాలకు చికిత్స అందించారు. మొత్తం 1310 పశువులు, జీవాలకు చికిత్స అందించినట్లు డాక్టర్ తెలిపారు. జెడ్పీటీసీ షేక్ జమీలా గఫూర్, టీడీపీ నాయకులు కాంద్రుకాశియ్య, అనుమల వెంకట్రామిరెడ్డి, మన్నెం శ్రీను, నలజాల కోటేశ్వరరావు, దుద్దుల యోహను, షేక్ సలీం, విలేజ్ వెటర్నరీ సహాయలు, గోపాలమిత్రలు పాల్గొన్నారు.

పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

లంకెలకూరపాడు(ముప్పాళ్ళ): పశు వైద్య శిబిరాలను పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ ముఖ్య కార్యనిర్వాహణాధికారి డాక్టర్.ఎం.శ్రీనివాసరావు చెప్పారు. మండలంలోని లంకెలకూరపాడు, మాదల గ్రామాల్లో రాష్ట్రీయ గోకుల్ మిషన్ సహకారంతో రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ, పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పశు వైద్య శిబిరాలను మంగళవారం పరిశీలించారు. 55 దూడల ప్రదర్శన నిర్వహించి, మొదటి మూడు స్థానాల్లో నిలిచిన పశు యజమానులకు బహుమతులు అందించారు. శిబిరాల ప్రత్యేకాధికారి, డీఎల్‌డీఏ ఫీల్డ్‌ఆఫీసర్ డాక్టర్ ప్రేమ్‌చంద్, డీఎల్‌డీఏ వీఏఎస్ డా.చలపతి రావు, మండల పశువైద్యాధికారి ఎం.పుల్లారెడ్డి, ఎల్‌ఎస్‌ఏ శ్రీనివాసరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రీ-సర్వే సమగ్రంగా పూర్తి చేయాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఆర్డీవో రమణకాంత్‌రెడ్డి

ముప్పాళ్ళ: గ్రామంలో భూముల రీసర్వే ప్రక్రియను సమగ్రంగా పూర్తి చేయాలని సత్తెనపల్లి ఆర్డీవో జీవీ రమణకాంత్‌రెడ్డి చెప్పారు. తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు, సర్వే సిబ్బందితో రీసర్వే ప్రక్రియపై మంగళవారం సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు రీ సర్వే పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ భూములను గుర్తించి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ముందుగా హద్దు రాళ్లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. గతంలో జరిగిన రీసర్వే వివరాలపైన ఆరా తీశారు. అంతకు ముందు రీసర్వే ప్రక్రియ పై జిల్లా జాయింట్ కలెక్టర్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు తహసీల్దార్ ఎం.భవానిశంకర్, సర్వే సిబ్బందితో కలిసి హాజరయ్యారు.

ఆదర్శ పాఠశాలలో సామాజిక తనిఖీ



విద్యార్థులతో కలసి భోజనం చేస్తున్న ఏపీ శాప్ డీఆర్‌పీ శరత్‌కుమార్, ప్రిన్సిపల్

నకరికల్లు: పాఠశాలల్లో విద్యార్థులకు కల్పిస్తున్న వసతులు, బోధనా విధానాలపై తనిఖీలు చేపడుతున్నట్లు ఏపీశాప్ డీఆర్‌పీ శరత్‌కుమార్ అన్నారు. మండలంలోని దేచవరం ఆదర్శ పాఠశాలలో మంగళవారం సోషల్ ఆడిట్ చేపట్టారు. నిధులు, వినియోగం, తరగతి గదులు, మధ్యాహ్న భోజనం, మంచి నీటి సౌకర్యం, ల్యాబ్, క్రీడా స్థలం, మౌలిక వసతులు, విద్యార్థుల భద్రత తదితర పలురకాల అంశాలను యాప్‌లో పొందుపరిచారు. 10వతరగతి, ఆరో తరగతి విద్యార్థులతో నేరుగా మాట్లాడారు. విద్యార్థులతో పాటు కలసి భోజనం రుచి చూశారు. పలు వివరాలను నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రులతో బుధవారం మాట్లాడి వివరాలు నమోదు చేసుకుంటామని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ కె.వేళాంగిణి మేరీ, సిబ్బంది పాల్గొన్నారు.

గుండ్లపల్లిలో దివ్యాంగ పింఛన్ల తనిఖీ



పింఛన్లు తనిఖీ చేస్తున్న అధికారుల బృందం

నకరికల్లు: దివ్యాంగ పింఛన్‌దారుల అర్హతను గుర్తించేందుకు ప్రత్యేక బృందాలు మండలంలో పర్యటిస్తున్నట్లు ఎంపీడీఓ జి.కాశయ్య తెలిపారు. గుండ్లపల్లి గ్రామంలో మంగళవారం దివ్యాంగ పింఛన్లు తనిఖీ చేసినట్లు చెప్పారు. 54 మంది మంచాల్లో ఉన్న పింఛన్‌దారులు, 1,554 మంది దివ్యాంగ పింఛన్‌దారులు ఉన్నట్లు తెలిపారు. ఈ నెల 28వ తేదీ నుంచి మండల వ్యాప్తంగా తనిఖీలు చేపడతున్నట్లు తెలిపారు. వైద్యులు వెంకటేశ్వర్లు, మణికంఠ, ఈఓపీఆర్డీ కె.వి.శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



నిరుపయోగంగా పెదకూరపాడు సీహెచ్‌సీ భవనం

అభివృద్ధిపై 'కూటమి' కక్ష



ఖాళీగా జలాల్‌పురం గ్రామ సచివాలయం



నిరుపయోగంగా పెదకూరపాడు సచివాలయం

పెదకూరపాడు: గత ప్రభుత్వం రూ.లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామ సచివాలయాలు, పెదకూరపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో సిబ్బంది విధులు నిర్వహించకుండా కూటమి ప్రభుత్వం నిరుపయోగంగా మార్చింది. పెదకూరపాడులోని 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని గత ఏడాది ఫిబ్రవరి 26న, పెదకూరపాడు సచివాలయం–2ను గతేడాది ప్రారంభించారు. జలాల్‌పురం గ్రామ సచివాలయాన్ని ప్రారంభించి రెండేళ్లవుతోంది. కొంత కాలం ఇక్కడ విధులు నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామంలోని కూటమి నేతల ఒత్తిళ్లతో ఇక్కడ నుంచి గ్రామ పంచాయితీ కార్యాలయంలోకి సిబ్బందిని తరలించారు. ప్రభుత్వ ధనంతో నిర్మించిన భవనాలు రాజకీయ కక్షలతో నిరుపయోగంగా మారాయి. వీటిపై ఎంపీడీవో రామకృష్ణను వివరణ కోరగా కాంట్రాక్టర్లు అప్పగించలేదంటున్నారు. సీహెచ్‌సీకి సంబంధించి పరికరాలు రాలేదని ఆ శాఖ సిబ్బంది తెలిపారు.

28 మందికి ఉద్యోగ అవకాశాలు



క్రోసూరు: ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం క్రోసూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన జాబ్ మేళాలో 28 మంది కి ఉద్యోగావకాశాలు కల్పించినట్లు ప్రిన్సిపల్ బీవీ రమాదేవి తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగాలు పొందిన వారికి నియామక ఉత్తుర్యులు అందజేశారు. జాబ్ మేళాకు 4 కంపెనీల ప్రతనిధులు రాగా.. 46 మంది నిరుద్యోగులు హాజరైనట్లు తెలిపారు. సంస్థ కో–ఆర్డినేటర్ బి.అంజిరెడ్డి, ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజీ వై.పి.శ్రీనివాస్, కంపెనీల హెచ్‌ఆర్ ప్రతినిధులు, వైస్ ప్రిన్సిపల్ డేవిడ్ రాజు పాల్గొన్నారు.